# సుప్రభ

రూపానికే కాక, పాండిత్యానికీ. శీల సంపదకు, నియమ నిష్ఠలకూ విలువ నిచ్చే మహనీయులు ఈ లోకంలో లేకపోలేదు. అలాంటి మహనీయుల్లో ఒకడు వదాన్య మహర్షి.

అష్టావక్రుని కీర్తి ప్రఖ్యాతులు వదాన్య మహర్షి చెవిని సోకాయి. పన్నెండేళ్ళు నిండక మునుపే వేదవేదాంగ పారంగతుడయ్యాడు ఆ బాలుడు. పండిత సభల్లోకి అతనిని ఎవరైనా రానియ్యక అడ్డగిస్తే అలాటి వారిని చూసి ఓ చిరునవ్వు నవ్వేవాడు. అంతేకాదు... జ్ఞానవృద్ధుడే వృద్ధుడు అంటూ తోసుకుని పండిత సభల్లోకెళ్ళి విజయగర్వంతో బయటకొచ్చేవాడు.

ఆ విజయ పరంపరలు విన్న వదాన్యుడు అష్టావక్రుని గూర్చి శిష్యులకు అనుక్షణం చెప్తూండేవాడు. ఆ మాటలు వదాన్యుని కుమార్తె సుప్రభ శ్రద్ధగా ఆలకించేది. పాండిత్యమంటే ఎనలేని గౌరవమున్న తండ్రి అష్టావక్రుని పాండితీ వైభవాన్ని మెచ్చుకుంటుంటే - అతని పట్ల అభిమానం, భక్తి, గౌరవం పెరిగాయి సుప్రభకి. అతన్ని చూడాలని, అతను తన తండ్రితో సంభాషిస్తుంటే వినాలని మనసులో ఎన్నోసార్లు అనుకునేది.

అష్టావక్రుడు బ్రహ్మచర్య దీక్ష చాలించి, గృహస్థాశ్రమపు ఆలోచనలు రాగానే, తనకు తగిన కన్య ఎవరా అని ఊహించసాగాడు. పాండిత్యమంటే భక్తి గౌరవాలున్న స్త్రీ తనకు భార్యగా ఉండేందుకు తగినదని మనసు కనిపించింది.

తపోధనుడైన వదాన్య మహర్షి, అతని కుమార్తె గురించి ఇంతకుముందు విన్నాడు. యుక్త వయస్కురాలైన సుప్రభ అతని కళ్ళముందు నిల్చింది. మిలమిలలాడే కళ్ళతో, నల్లని కేశపాశంతో, నిండైన శరీర సౌందర్యంతో అతని మనోఫలకంపైన కదలాడింది సుప్రభ.

వదాన్య మహర్షి కుమార్తె సుప్రభకి, వేదాధ్యయనమన్నా, పాండిత్యమన్నా గౌరవం ఉంటుందని అతనికి తోచింది. సుప్రభ తన అర్ధాంగి అయితే తన గృహస్థ జీవితం సాఫల్య మవుతుందని తలంచాడు అష్టావక్రుడు.

ప్రభాత సంధ్యా కాంతులు నదీసైకతాం మీద మెరుస్తున్నాయి. నిత్యాను ష్ఠానం పూర్తి చేసుకున్న అష్టావక్రుడు వదాన్యుని ఆశ్రమం వైపు నడక సాగించాడు.

ఆశ్రమం సమీపిస్తున్న కొద్దీ అతని మనసు పరిపరి విధాల పోయింది. తన పాండిత్యాన్ని ఇష్టపడొచ్చు కానీ తనను భర్తగా ఇష్టపడుతుందో లేదో సుప్రభ? వదాన్యుడు తనను వేద విదునిగా సన్మానించవచ్చు. కానీ తన కోరిక తిరస్కరిస్తే?-అష్టావక్రుని అడుగు ముందుకు పడలేదు. అలాగే నిలబడ్డ అతన్ని ఎవరో వెన్ను తట్టినట్లయింది. ఏనాడూ, ఎక్కడా ఓటమి ఎరుగని తను, ఈనా డెందుకు ఇలా బెంవుతున్నాడు? తన నియమ నిష్ఠలు, తన శీల సంపద, తన పాండిత్యమే తనని ఇప్పుడూ గెలిపిస్తాయని అనుకుంటూ అష్టావక్రుడు చర చరా, గబగబా నడిచి వదాన్యుని ఆశ్రమం చేరాడు.

అష్టావక్రుడు తన ఆశ్రమానికి రావడమే భాగ్యంగా భావించాడు వదా న్యుడు. అతనికి అతిథి మర్యాదలు చేస్తుంటే తండ్రి వెనుక నిలిచి శ్రద్ధగా గమనిస్తున్న సుప్రభ క్షణమాగి వెంటనే లోపలికి వెళ్ళిపోయింది.

తన మనసులో మాట అష్టావక్రుడు చెప్పగానే ఆశ్చర్యపోయాడు వదాన్యుడు అతను గ్రహస్థాశ్రమం స్వీకరించడానికి తన కుమార్తెను వివాహ మాడడమా? మెరుపు తీగెలా సుప్రభ అతని కళ్ళముందు నిలుస్తోంది.

అష్టావక్రుడి విజయ పరంపరలు ఒక్కసారి వదాన్యుని మనసులో మెది లాయి. మహర్షి పెదాలపైన చిన్న నవ్వు నిలిచింది. అష్టావక్రుని పరీక్షించాలనే కోరిక కలిగింది వెంటనే.

"నా కుమార్తె నిచ్చి వివాహం చేస్తాను...కానీ"-

అష్టావక్రుడు మహర్షి ముఖంలోకి చూశాడు.

"నువ్వు వివాహానికి ముందు ఉత్తర దిశను చూసి రావాలి!" వదాన్యుడు నెరిసిన గడ్డం సరిచేసుకున్నాడు.

"తమరే పని చెప్పినా చేస్తాను. కానీ ఆ దిక్కుకి ఎలా వెళ్ళాలి? వెళ్ళి ఏం చేయాలి?"

సుప్రభ తండ్రి వంక చూస్తోంది. వదాన్యుడు చిరునవ్వు నవ్వాడు... అష్టావక్రుని వంక చూస్తూ-

"అలకా పట్టణం మీదుగా వెళ్ళు. అక్కడి నుంచి హిమవత్పర్వత శిఖరం చేరు. అక్కడ పార్వతి తపస్సు చేసిన ప్రాంతంలో ఉన్న అరణ్యం-"

"అరణ్యమా?" అష్టావక్రునికి ఏమీ బోధపడడం లేదు.

"అక్కడ మణి మందిరంలో ఒక ప్రౌఢ వయస్కురాలుంటుంది. ఆమెను చూసిరా."

తలవంచి ఆలోచనా నిమగ్నుడైన అష్టావక్రుడు, కొద్ది సేపట్లోనే ఉత్సాహం నింపుకుని, బయలుదేరాడు అక్కడినుంచి.

మణిమందిరం చేరిన అష్టావక్రునికి ఎదురొచ్చారు కొందరు స్త్రీలు. అతన్ని అంతఃపురంలోకి తీసుకువెళ్ళి వెనుదిరిగారు. ప్రౌఢ స్త్రీ అతన్ని ఆహ్వానించి పుష్పాలతో పూజించింది. ఆమె చూపులు, చేష్టలు అష్టావక్రునికి చాలా వింత గొల్పాయి.

చీకటులు ముసురుతున్నాయి. అలసిపోయిన అష్టావక్రుడు తన శయ్యపైన నిద్ర కుపక్రమించాడు. అంతలోనే కంకణాల గలగలలు, మంజీరాల ఝుమ ఝుమలు అతని చెవిని సోకాయి. ఒక దివ్య పరిమళం శయనాగారమంతా నిండింది. అతను విస్తుపోయి చూస్తుండగానే ఆ ప్రౌఢ అతని శయ్యపై చేరి గాఢాలింగనం చేసింది అతన్ని.

కలో నిజమో తెలియడం లేదు. ఆమె కౌగిలిని విడిపించుకుని లేచాడు అష్టావక్రుడు.

ఆమె అతన్ని పోనీయడం లేదు. ఆమె అధరాలు స్పందిస్తున్నాయి. వక్షోజాలు ఎగసిపడుతున్నాయి. ఆమె అతన్ని తిరిగి కౌగిలిలో బంధించింది.

అష్టావక్రుని సంయమనం రవ్వంత సడలడంలేదు. ఆమెను తోసేశాడు.

"నా అంతట నేను కోరి వస్తే నీకింత తిరస్కారమా? నా ఈ సంపదను, నన్ను నువ్వే స్వీకరించు. దివ్యభోగా లనుభవించు." ఆమె అతన్ని రకరకాల ప్రలోభపెట్టాలని చూసింది,

అతని మనసు నిండా సుప్రభ రూపమే కదలాడుతోంది. ఈమెను వదిలించుకుని, వేగంగా వదాన్యుని ఆశ్రమం చేరాలనే తొందర ఎక్కువైంది.

"నన్ను వెళ్ళనీ...నువ్వు ధర్మమార్గం ఎంచుకో. నేను సుప్రభను వివాహమాడి, పవిత్రమైన గృహస్థాశ్రమంలో అడుగు పెట్టాలనుకుంటున్నాను... పక్కకు తొలుగు - వెళ్ళనీ నన్ను..." అష్టావక్రుడు ఆమెను తోసి ముందుకు అడుగువేశాడు.

అతని మాటలకు ఆమె చలించలేదు.

వయ్యారాలు ఒలకపోస్తూ ఎదురుగా నిలిచింది. సౌందర్యం రాసిపోసినట్లుగా ఉంది. రతీదేవి మరు రూపంలా ఉంది.

అయినా విముఖుడై ముందుకు నడుస్తున్నాడు అష్టావక్రుడు. అతని వంక చూస్తూ కిలకిలా నవ్వింది ఆమె.

ఒక్క నిముషం ఆమె వంక చూశాడు అష్టావక్రుడు. "మహాత్మా వదాన్య మహర్షి చెప్పిన ఉత్తర దిశను నేనే! నువ్వు కోరిన సుప్రభ నిన్ను తప్పక వరిస్తుంది...వేగంగా వెళ్ళు" పక్కకు తప్పుకుని దారి చూపించిందామె! మహా సంయమీశ్వరుడయిన అతనికి నమస్కరిస్తూ.

* * *

దూరంగా వస్తున్న అష్టావక్రుని ఆశ్రమం వాకిట నిలిచిన సుప్రభ శ్రద్ధగా చూస్తోంది. అతను దగ్గరవుతున్న కొద్దీ మరీ పరిశీలనగా చూస్తోంది.

ఆశ్రమంలో అడుగు పెడుతున్న అష్టావక్రుడు వేదమూర్తిలా, విజ్ఞాన ఖనిలా, సహస్ర సూర్య ప్రభారాశిలా ఆమె కళ్ళకు కనిపించాడు.

అతడు తన భర్త- సుప్రభ కళ్ళలో ఆనంద రేఖలు తాండవించాయి.

పాదాభివందనం చేస్తున్న అష్టావక్రుని లేవనెత్తి శిరసు నిమిరాడు వదాన్య మహర్షి.

సుప్రభా, అష్టావక్రుల వివాహ వేడుకలు ఆశ్రమవాసులంతా ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు.

*

(ఆధారం : కవిత్రయంవారి శ్రీమదాంధ్ర మహాభారతం: అనుశాసనిక పర్వం : ద్వితీయాశ్వాసం)

(ప్రచురణ : ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక : 15-6-1988)